AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## ‘నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్’కు అనుమతి లేదు..: డీఈవో

**అక్షరటుడే, ఇందూరు:** డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో అడ్మిషన్లకు ఎలాంటి అనుమతులు లేవని డీఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సదరు పాఠశాలను గుర్తిస్తూ.. అడ్మిషన్లకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కాబట్టి ఈ విషయాన్ని గమనించి విద్యార్థుల తల్లిదండ్రులు సదరు పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవద్దన్నారు. గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను అడ్మిన్ చేయించాలని డీఈవో సూచించారు.

6-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



# కన్నోళ్లకు కన్నీళ్లు..

■ వృద్ధాప్యంలో పట్టించుకోని పిల్లలు ■ అనాథలుగా మారుతున్న తల్లిదండ్రులు
■ తిండి కూడా పెట్టకుండా వేధిస్తున్న వైనం ■ అధికారులను వేడుకుంటున్న వృద్ధులు

**కష్టపడి తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కొందరు పట్టించుకోవడం లేదు. కడుపు మాడ్చుకొని.. తమకు అన్నం పెట్టిన అమ్మానాన్నలను మరిచిపోతున్నారు. చేయి పట్టుకొని నడిపించిన వారిని.. వృద్ధాప్యంలో భారంగా భావిస్తున్నారు. అండగా ఉండాల్సిన సమయంలో అన్నం కూడా పెట్టకుండా వేధిస్తున్నారు. పెళ్లిలు కాగానే తల్లిదండ్రులను మర్చిపోతున్నారు. వారి పేరిట ఉన్న ఆస్తులను రాసుకుని బయటకు గెంటేస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోలేని పిల్లల ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. చివరి దశలో అండగా నిలవాల్సిన కొడుకుల కర్కశత్వాన్ని ఆ తల్లిదండ్రులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి కొడుకులపై తల్లిదండ్రులు చేస్తున్న ఫిర్యాదులు అధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

### తిండి పెట్టకుండా వేధింపులు

తల్లిదండ్రులు కష్టం చేతనైనన్ని రోజులు కడుపు కట్టుకుని పనిచేసి కొడుకుల భవిష్యత్తు కోసం పని చేసి సంపాదించి పెడుతున్నారు. అలాంటి వారికి చివరి దశలో కనీసం తిండి కూడా పెట్టకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. కోడళ్లు సైతం అత్తమామలను తల్లిదండ్రులుగా చూసుకోవాల్సింది పోయి కర్కశంగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమిటని కూడా ఆలోచించడం లేదు.

### అధికారుల చెంతకు..

తమను కొడుకులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. తమ పేరిట ఉన్న ఆస్తులు వారి పేరిట మార్చుకుని తమను నిర్లక్ష్యం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. మండల స్థాయిలో ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. దాంతో అధికారులు పిల్లలను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

### 15 రోజుల్లో నలుగురు ఫిర్యాదు

ప్రతి సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి నేరుగా కలెక్టర్ ఫిర్యాదులు తీసుకుని వారితో మాట్లాడి ఓపికగా సమస్యలు వింటున్నారు. అయితే భూ సమస్యలు, కబ్జాలు, అధికారులపై ఫిర్యాదులు మాత్రమే కాకుండా కొడుకులు పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు ఇటీవల పెరిగిపోతున్నాయి. గడిచిన 15 రోజుల్లోనే నలుగురు తల్లిదండ్రులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారంటే జిల్లాలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థం అవుతోంది. గత నెల 16న దోమకొండకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు తన ఇద్దరు కొడుకులు తిండి కూడా పెట్టడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తన ముగ్గురు కూతుళ్లే తన బాగోగులు చూస్తున్నారని వాపోయింది.

### చర్యలు తీసుకుంటారా?

తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకుల వేతనాల నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు కోత విధిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి పెంచితే రెక్కలు రాగానే వారిని పట్టించుకోకుండా వదిలేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవాలని కోరారు. ప్రభుత్వ తెచ్చిన బిల్లుతో ఉద్యోగుల తల్లిదండ్రులకు మేలు జరగనుంది. అయితే ఉద్యోగం కాకుండా ఇతర పనులు చేసే వారు అమ్మానాన్నలను పట్టించుకోకపోతే ఎలాంటి చర్యలు తీసుకుంటారని చర్చ జరుగుతోంది. ఇలాంటి వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తేవాలని కోరుతున్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా 95 ఫిర్యాదులు స్వీకరంచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 16న మండల స్థాయి సభలు సక్సెస్ అయ్యేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 2న నిర్వహించిన గ్రామ సభలు విజయవంతం అయ్యాయని, అదే స్ఫూర్తితో మండల స్థాయి సభలను కూడా జరిగేలా చూడాలన్నారు. మండల సభ నిర్వహణ సమయానికి ముందే ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు, రేషన్ కార్డులు, పెన్షన్ లు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో అందిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనాభా గణనకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్ని మున్సిపల్ పట్టణాలు, మండలాల్లో ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం




**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏప్రిల్ 6 నుంచి 10 వరకు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణలో మండలంలోని ఏడు పంచాయతీలకు చెందిన వార్డుసభ్యులు పాల్గొంటున్నారు. పంచాయతీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, బాధ్యతలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ముప్కాల్ ఎంపీవో, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సభ్యులు, సంబంధిత గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆహార పరిరక్షణపై అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఇందూరు:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లాలో పలు చోట్ల ఆహార పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం కోటగల్లిలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ విద్యార్థులతో కలిసి ఆహార పరిరక్షణ వాకథాన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నివాస హాస్టళ్లలో పనిచేస్తున్న ఆహార నిర్వాహకులకు (వంటవారు, సహాయకులు) ఆహార పరిరక్షణపై కొత్త అంబేద్కర్ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. అంగన్‌వాడీలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్లను సైతం అందజేశామన్నారు. అనంతరం ప్రభుత్వ గిర్రాజ్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' వాహనం ద్వారా ఆహార ముడి పదార్థాల కల్తీ, ఆహార కల్తీని గుర్తించే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆహార భద్రత అధికారి నవిత, ల్యాబ్ టెక్నీషియన్ బి తిరుపతి, సహాయకుడు బి సాయికృష్ణ, ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహన డ్రైవర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణికి 32 ఫిర్యాదులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పోలీస్ ప్రజావాణిలో భాగంగా 32 ఫిర్యాదుల స్వీకరించారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడిన సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జీలకు ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు. చట్టపరమైన పరిష్కార మార్గం చూపాలని వారిని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా ప్రజావాణిలో తనను సంప్రదించవచ్చన్నారు. ప్రజలు నిర్భయంగా వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకునే మార్గం కల్పించేందుకే ప్రతి సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో సుమారు 500కు పైగా ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంటను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతన్న ఆరుగాలం పండించిన పంట అకాల వర్షంతో నేలవాలిందని.. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాన్ని రైతులకు వర్తింపజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇప్పటికి కూడా నష్టపోయిన పంటలను పరిశీలించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత ప్రజలను పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలను ఆదుకోవాల్సిన వారు హైదరాబాద్‌లో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని డిమాండ్ చేశారు. ధర్పల్లి మండలం రామడుగు, ఇతర గ్రామాల్లో కూడా అధికంగా వరి పంటకు నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి, యానంపల్లి సర్పంచ్ భాస్కర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చౌకి లక్ష్మణ్ రమణ, రవినాయక్, పరుశురాం, సుద్ధపల్లి సాంపల్లి, సుద్దపల్లి తండా, సాంపల్లి తండా వాసులు పాల్గొన్నారు.




## బాల్‌భవన్‌లో సందడి.. అడ్మిషన్ల కోసం క్యూ..

**వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో నగరంలోని జిల్లా కోర్టు వద్ద గల బాల్‌భవన్‌లో సందడి మొదలైంది. అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయానికి క్యూ కట్టారు. బాల్‌భవన్‌లో సెలవుల్లో భాగంగా సుమారు 30 అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి రోజుకు 150 అడ్మిషన్లు మాత్రమే తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తిగల వారు విద్యార్థుల ఆధార్, రెండు ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించవచ్చు.**

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## జీవనశైలిలో మార్పులతోనే అనారోగ్య సమస్యలు




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** ప్రస్తుత జీవనశైలిలో మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయని మెడికవర్ హాస్పిటల్స్ జనరల్ ఫిజీషియన్ ఆనంద్ మాలు అన్నారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ ఆనంద్ మాలు మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత జీవనశైలిలో మార్పులతో మధుమేహం, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సరైన ఆహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ఈ మేరకు మెడికవర్ హాస్పిటల్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ స్వామి, డీఎంఎస్ యజ్ఞ, మార్కెటింగ్ హెడ్ వినయ్ పాల్గొన్నారు.



## బోరు వేయించిన సర్పంచ్



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని తాగునీటి సమస్యకు సర్పంచ్ పరిష్కరించారు. ఈ మేరకు సోమవారం సర్పంచ్ కల్లూరి సంధ్య బోరు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని కసాబ్ గల్లీలో నీటి సమస్య తీర్చడానికి పంచాయతీ నిధులతో బోర్ వేయించడం జరిగిందన్నారు. కాలనీలో బోర్ వేయించడంతో గ్రామస్థులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నబీ, మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, పంచాయతీ కార్యదర్శి యాదవ్, వార్డు మెంబర్ అనిల్, హన్మాండ్లు, మన్సూర్, కిరణ్ సేట్, ఫిర్దోస్‌ఖాన్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య చికిత్సలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని తొమ్మిదో వార్డుకి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు ఇమ్రాన్‌కు అత్యవసర శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. సాధారణ కుటుంబానికి చెందిన ఇమ్రాన్ కుటుంబం ఇప్పటికే వైద్య ఖర్చులతో ఆర్థికంగా చితికిపోయింది. దీంతో వారి పరిస్థితిని కౌన్సిలర్ గాదె తిరుపతి వెంటనే ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ సీఎం సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. అనంతరం కౌన్సిలర్ గాదె తిరుపతి ఇమ్రాన్ పరిస్థితిపై వైద్యులతో చర్చించి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

# స్తంభాలు భయపెడుతున్నాయ్..



కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రోడ్లపై విద్యుత్‌స్తంభాలు వాహనదారులను భయపెడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో రోడ్లపైకి వచ్చిన స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు తిరిగే ప్రదేశాల్లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్‌స్తంభాలను త్వరగా తొలగించాలని వారు కోరుతున్నారు.
– అక్షరటుడే, కామారెడ్డి

■ పాఠశాలలు, షాపింగ్ మాల్స్ పక్కనే స్తంభాలు ■ పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు ■ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పట్టణంలోని ప్రధాన రోడ్లపై విద్యుత్‌స్తంభాలు వాహనదారులను భయపెడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లోని రోడ్లపై ఉన్న స్తంభాలను కూడా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిజాంసాగర్ రోడ్డులో..

కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి జీవదాన్ పాఠశాల వెళ్లే దారిలో ఓ భారీ భవనంలో సూపర్ మార్కెట్, ఓ ప్రైవేటు పాఠశాల కొనసాగుతున్నాయి. ఆ పక్కనే మరో స్కూల్ కూడా ఉంది. అలాగే కొద్ది దూరం ముందుకు వెళ్తే మూడు అపార్టుమెంట్లు ఉన్నాయి. వీటన్నిటికి వెళ్లే దారి సూపర్ మార్కెట్, ఓ పాఠశాల మధ్యలో ఉంది. అయితే ప్రధాన రహదారికి ఆనుకుని పాఠశాలకు వెళ్లే దారిలో అటు ఇటువైపుగా సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో మాత్రం ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది.

### స్కూల్ బస్సులు అదే దారిలో..

పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కార్లు, బైక్‌లపై వెళ్తుండగా రద్దీ ఏర్పడుతోంది. మధ్యలో విద్యుత్ స్థంభం ఉండడంతో రహదారి ఇరుకుగా మారుతోంది. అలాగే పాఠశాలలకు సంబంధించిన బస్సులు సైతం అదే దారిలో వెళ్తుంటాయి. ఆ సమయంలో విద్యుత్ స్థంభానికి పక్క నుంచే ప్రమాదకరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు సూపర్ మార్కెట్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి, దారిలో ఇనుప విద్యుత్ స్తంభానికి మధ్యలో నుంచి వెళ్లడానికి కూడా అవకాశం లేదు. సిమెంట్ స్తంభం, ఇనుప స్తంభం మధ్యలో సపోర్ట్ వైరు ఉండడం కూడా ప్రమాదకరంగా మారుతోంది. ఈ క్రమంలో అనుకోని ఘటన జరిగితే ఎవరూ ఊహించలేని ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

### స్పందించని విద్యుత్‌శాఖ..

అయినప్పటికీ విద్యుత్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆ దారి ప్రమాదకరంగా ఉందని పాఠశాలల యాజమాన్యాలు కూడా ఫిర్యాదు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రమాదం జరిగాక బాధపడకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్‌ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. మరి అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

## కంప్యూటర్ ల్యాబ్ దాతకు సన్మానం



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పోతంగల్ కలాన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.2.5లక్షల విలువైన ఆరు కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత అమాస గురు చరణ్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు సోమవారం సన్మానించారు. అనంతరం దాత మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్ ఉపయోగించుకొని సాంకేతిక నైపుణ్యం అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులకు, పోతంగల్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగారావు, ఉపాధ్యాయులు ప్రదీప్, సత్యనారాయణ, రవి కుమార్, గంగాధర్, దేవిక రాణి, రామకృష్ణ, రాజ్ కుమార్, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని తాడ్కోల్‌లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ అందే రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాజిద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గంగుల గంగారం, వార్డు మెంబర్ కొర్రి సవిత, పరుష వీరేశం, బత్తుల లక్ష్మి, సతీష్ రెడ్డి, బొప్పిడి భూం రెడ్డి, అనిత, ముల్కీ పండరి, కావేరి, సఫియా బేగం, విక్రం రెడ్డి, దాసరి నవీన్ కుమార్, జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం..

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నాయకులు తమ ప్రాంతాల్లో జెండాలను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాడు రెండు పార్లమెంట్ స్థానాల నుంచి ప్రారంభం అయిన పార్టీ నేడు ఈ స్థాయికి ఎదిగిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దపార్టీగా అవతరించిందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అన్నిరంగాల్లో ముందడుగు వేస్తోందన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



నిజామాబాద్ నగరంలో బీజేపీ జెండా ఆవిష్కరణ



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



ఆర్మూర్‌లోని 15 వార్డులో..



బాన్సువాడ పట్టణంలో..



మాక్లూర్ మండలం దుర్గానగర్‌లో..




లింగంపేట్‌లో..



గాంధారి మండల కేంద్రంలో..



ఆలూరు మండలం కల్లెడిలో..



మాక్లూర్‌లో..



ఆర్మూర్ పట్టణంలోని 12వ వార్డులో..




ఎల్లారెడ్డిలో..

## విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేత



**అక్షరటుడే, ముప్కాల్:** మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు యూనిఫామ్‌లు, స్పోర్ట్స్ డ్రెస్సులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ బర్కుంట నిశాంత్, మండల విద్యాధికారి గంగారాం, ఉప సర్పంచ్ సురేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందించేందుకు యూనిఫామ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేశ్వర్, హెచ్‌ఎం రఘు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాయిలు, ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ స్వప్న, ఆయా రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## హైవేపై రోడ్డు ప్రమాదం.. కారు ఢీకొని ఒకరి మృతి

**అక్షరటుడే, మాక్లూర్:** జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అప్పుడే ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరిన ఓ వ్యక్తిని కారు ఢీకొంది. ఈ ఘటన లో ద్విచక్ర వాహనదారులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తికి బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కక్కడే మృతి చెందాడు. మృతుడు బోర్గాం(కె) గ్రామానికి చెందిన చెగంటి భూమన్న (52)గా స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## మొరం అక్రమ తవ్వకాలపై సీసీఎస్ పోలీసుల మెరుపుదాడి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మొరం అక్రమ తవ్వకాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుగ్గుట్ట వెనుకభాగంలో మొరాన్ని అక్రమంగా తవ్వుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలకు వినియోగిస్తున్న రెండు జేసీబీ యంత్రాలు, మూడు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాహనాలను తదుపరి చర్యల కోసం నందిపేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. ఈ సందర్భంగా మస్తాన్ అలీ మాట్లాడుతూ మొరం అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి..




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మత్తుపదార్థాల కారణంగా జీవితాలు చిన్నాభిన్నమవుతాయని.. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఎస్సై అనిల్ పేర్కొన్నారు. మండలంలోని హాసాకొత్తూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మత్తుపదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక'లో భాగంగా పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ.. మత్తుపదార్థాల కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు పోలీసులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 'యాంటీ డ్రగ్ కమిటీ'ని ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు పాఠశాల లోపల, వెలుపల అనుమానాస్పద పరిస్థితులపై నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి రహిత గ్రామంగా హాసాకొత్తూరును తీర్చిదిద్దడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ వివరాలు వెల్లడించారు. పట్టణంలో స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా 12 మంది వాహనదారులు మద్యం తాగి నడిపినట్లుగా గుర్తించి వారిని ఆర్మూర్‌లో కోర్టులో ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి 9 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురికి నాలుగురోజుల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.